సాక్షి అనకాపల్లి

సోమవారం । 12 । మే । 2025



ఐకమత్యమే బలం

మల్కాపురం: విశాఖ మల్కాపురం గ్రంథాలయంలో జరిగిన వేసవి శిబిరంలో చిన్నారులకు దేశభక్తిపై అవగాహన కల్పించారు.

ఉష్ణోగ్రతలు

ఆదివారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	36.3/24.5
చోడవరం	:	38.0/27.0



అప్పన్న సేవలో ఒడిశా దాసులు

8లో

న్యూస్‌రీల్

సింహాచలం ఈవోగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో(పూర్తి అదనపు బాధ్యతలు)గా దేవదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సింహగిరికి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ కంచెమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గతంలో పలుమార్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా, డిప్యూటీ ఈవోగా ఆమె విధులు నిర్వర్తించారు.

రాష్ట్ర స్థాయి వుషు పోటీలకు నింజాస్ అకాడమీ క్రీడాకారులు



స్టేట్ వుషు పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు

నర్సీపట్నం: స్టేట్ వుషు చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన నింజాస్ అకాడమీ నుంచి 17 మంది బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు కర్నూలులో జరగనున్న సబ్ జూనియర్, సీనియర్ బాయ్స్, గర్ల్స్ రాష్ట్ర స్థాయి వుషు టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటున్నారని కోచ్ ప్రియాంక తెలిపారు. పోటీలకు తరలివెళ్తున్న క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్స్ సుతాపల్లి శ్రీకాంత్, వెలగా నారాయణరావు, ఎస్ఆర్ఐ అల్లాడ సురేష్, సీనియర్ కోచ్ యర్రా శేఖర్ అభినందించారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని వారు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రెండో విడత చందనం సమర్పణ



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న వైదికులు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం రెండో విడత చందనం సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం వైదికులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల పచ్చి చందనంలో ఆదివారం పలు సుగంధ ద్రవ్యాలను కలిపారు. సోమవారం తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం చందనాన్ని సమర్పించనున్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వైదికులు చందనంలో సుగంధ ద్రవ్యాలను కలిపి సమర్పణకు వీలుగా సిద్ధం చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.
సింహాచలం క్షేత్రంలో సోమవారం వైశాఖ పౌర్ణమి ఉత్సవం కావడంతో ఆదివారం సాయంత్రానికే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు తరలి వచ్చారు.

పోక్సో కేసులో మరో ముగ్గురు అరెస్టు

చీడికాడ: చీడికాడ శివారు కొండవీధికి చెందిన మైనర్ బాలిక లైంగిక దాడి ఘటనపై నమోదు చేసిన పోక్సో కేసులో మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. 17 సంవత్సరాల బాలికను చీడికాడకు చెందిన పినబోయిన ఈశ్వర్ అనే మైనర్ మాయమాటలతో నమ్మించి గర్భం దాల్చేలా చేశాడు. బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈశ్వర్‌పై పోక్సో కేసు నమోదు చేసి జువనైల్ హోంకు తరలించారు. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు చేసిన అనకాపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు బాలికను బెదిరించి లోబర్చుకున్న చీడికాడకు చెందిన కిల్లి హరీష్, బుద్ధా కుమార్ స్వామి, మంచాలకు చెందిన చుక్కా శ్రీనులను అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

మండుటెండలో బతుకు పోరాటం

రెక్కాడితే గానీ డొక్కాడదు వారికి. జానెడు పొట్ట కోసం ఎండా, వానా సైతం లెక్క చేయరు. రోజంతా కష్టపడతారు. రెండు మూడు వందల కోసం ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెడతారు. తమ మీద ఆధారపడ్డ కుటుంబాన్ని పోషించాలి కదా మరి. అనకాపల్లి పట్టణంలో ఆదివారం మండుటెండను సైతం లెక్కచేయకుండా రోడ్డు పక్కనే అమ్ముకుంటూ.. అక్కడే తింటూ, నిద్రపోతూ చిరు వ్యాపారాలు సాగిస్తున్న వారి జీవన సమరం ఇది..

-అనకాపల్లి టౌన్



ఎవరైనా రిక్షా ఎక్కక పోతారా అని నిరీక్షణ



తువ్వాలు నీడలోనే వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారి



మామిడి పళ్లు అమ్మే వారి బతుకు అంత తీయగా ఉండదు



ఎండ మండిపోతుంటే చాకులు సాన పడుతున్న ఇమామ్

కొంతమంది వైద్య సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి ధర్మాసుపత్రి అర్థాన్నే మార్చేస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ప్రసవం చేయాల్సి ఉండగా, గర్భిణులకు ముందుగానే పురిటి కష్టాలు చూపిస్తున్నారు. మూడు నెలల క్రితం డెలివరీ కోసం వచ్చిన వారి నుంచి డబ్బులు గుంజుకున్న గైనిక్ సివిల్ సర్జన్ డాక్టర్ శోభాదేవిని కలెక్టర్ సస్పెండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయినప్పటికీ ఎన్టీఆర్ ఆస్పత్రిలో గైనిక్ విభాగంలో మార్పు కానరాలేదు. సాధారణ కాన్పుకు రూ.3 వేలు, సిజేరియన్‌కు రూ.5 వేలు..అంటూ రేటు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని గర్భిణులు గగ్గోలు పెడుతున్నారు.



గైనిక్ వార్డు



కాసులిస్తేనే కాన్పు

సాధారణ ప్రసవానికి రూ.3 వేలు, సిజేరియన్‌కు రూ.5 వేలు

లేదంటే బిడ్డ అడ్డం తిరిగిందని మెలిక

- ఇటీవలే లంచం తీసుకున్న గైనికాలజిస్ట్‌పై వేటు
- అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో దందా
- గతంలో రోజుకు 300 ఓపీలు, మెటర్నల్ చెకప్‌లు
- ఇప్పుడు సగానికి తగ్గిన ఓపీ సంఖ్య
- 10 నుంచి ముగ్గురికి తగ్గిన గైనిక్ వైద్యులు



సాక్షి, అనకాపల్లి: పండంటి బిడ్డ కోసం నవమాసాలు మోయడం ఒక కష్టం.. నెలలు నిండాక ఆ బిడ్డ తల్లి పొత్తిళ్లలోకి రావాలంటే అది మరింత కష్టం. కాన్పుల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేని పేదోళ్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇలాంటి వారిని వైద్యులు, సిబ్బంది పీడిస్తున్నారు. కాసులు సమర్పిస్తేనే కాన్పు అంటున్నారు. లేదంటే బిడ్డ అడ్డం తిరిగింది.. ఉమ్మనీరు తాగిందంటూ రకరకాల కారణాలు సాకుగా చెప్పి విశాఖలో కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. అక్కడకు వెళ్లలేని వారు అప్పోసప్పో చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల డీఆర్‌సీ మీటింగ్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నేరుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ ముందే ఎన్టీఆర్ ఆస్పత్రిలో పేదోళ్ల ప్రసవ వేదన దుస్థితిని ఎండగట్టారు. అయినా ఆస్పత్రి గైనిక్ విభాగంలో అదే తీరు కొనసాగుతోంది.

కాసులు గలగలలాడితేనే వైద్యం అందేది..

ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, పాయరావుపేట, చోడవరం నియోజకవర్గాల నుంచి రోగులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా.. పేదలు ఉండడం వల్ల వారంతా సాధారణ ప్రసవం కోసం వస్తారు. వారిని కొంతమంది డాక్టర్లు కాసులిస్తేనే కాన్పు చేస్తామని ఇబ్బంది పెడుతున్నారు. సాధారణ కాన్పుకు రూ.3 వేలు, సిజేరియన్లకు రూ.5 వేల వరకూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఓపీ ఫుల్.. వైద్యం నిల్

రోజువారీ సగటున ఎన్టీఆర్ ఆస్పత్రికి 600 వరకూ ఓపీ రోగులు వస్తుంటారు. (సోమవారం) 535 ఓపీలు నమోదయ్యాయి. వీరిలో 31 మంది రోగులు అడ్మిట్ అయ్యారు. ఈ ఆస్పత్రిలో 250 నుంచి 300 వరకూ బెడ్స్ సదుపాయం కలదు. వీటిలో కాన్పుల విభాగంలో రోజూ గర్భిణుల ఓపీనే రోజుకు సగటున 200 వరకూ స్త్రీలకు సంబంధించిన వ్యాధుల ఓపీ ఉంటుంది. రోజూ కాన్పుల కోసం అడ్మిషన్లు 10 నుంచి 20 నమోదవుతున్నాయి.

గైనిక్ విభాగంలో ప్రబలుతున్న సమస్యలివే..

- అనకాపల్లిలో జిల్లా స్థాయి ఎన్టీఆర్ ఆస్పత్రికి అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల నుంచి రోగులు వస్తుంటారు. సమీప ప్రాంతాలకు ఇదే పెద్దాసుపత్రి కావడంతో గైనిక్ విభాగంలో ఓపీలు ఎక్కువగా నమోదవుతాయి.
- గైనిక్ వార్డులో ఫ్యాన్లు తిరగక బాలింతలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. జనరేటర్ సదుపాయం ఉన్నా.. అది పది నిమిషాల వరకే పని చేస్తోంది. గైనిక్ వార్డులో ఇన్వెర్టర్ సదుపాయం లేదు.
- స్కానింగ్, ఎక్స్‌రే గదుల్లో ఏసీ సౌకర్యం లేదు.
- నిరంతరం రద్దీగా ఉండే అల్ట్రా స్కానింగ్ రూంలో ఒక్కరే రేడియాలజిస్టు అందుబాటులో ఉన్నారు. నెలవారీ చెకప్‌లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణులను సైతం మూడు గంటలకు పైగా స్కానింగ్ సెంటర్ల ముందు వెయిటింగ్‌లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.
- డిస్టిక్ ఆస్పత్రిలో ముగ్గురే గైనిక్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు.
- గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కాన్ చేస్తున్నా.. వారికి రిపోర్టు ఇవ్వడం లేదు. తెల్ల పేపర్‌పై పెన్‌తో రాసి పంపిస్తున్నారు. రేడియాలజీ విభాగం వైద్యులు ఒక్కరే ఉండడంతో రోజువారీ 30 స్కాన్‌లు చేయడం కష్టతరమవుతోంది.
- సర్జికల్ గ్లౌజులు లేవు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు చికిత్సలు, ఆపరేషన్ చేసిన సమయంలో కావలసిన కాటన్, ఐవీ క్యానల్, స్కానింగ్ జల్ కొరత ఉంది. కొన్ని రకాల సర్జికల్ వస్తువులు, రోజుకు రూ.3 వేల లోపు సామగ్రి ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నారు.
- ఆపరేషన్ సమయంలో కావాల్సిన మందులను ప్రైవేట్ దుకాణంలో రోగులతో కొనుగోలు చేయిస్తున్నారు.

ప్రసవ వేదనే..

ప్రసవం కోసం ఎన్టీఆర్ ఆస్పత్రికి పురుడు కోసం వస్తే, వారి నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. సిజేరియన్‌కు సరిపడా సర్జికల్ గ్లౌజులు, కాటన్‌తోపాటు ఇతర వస్తువులను తెచ్చుకోవాలని ప్రైవేట్ మెడికల్ షాపులకు రాస్తున్నారు. వాటి ధర రూ.2 వేల వరకూ ఉంటుంది. డెలివరీ అయి ఇంటికి వెళ్లేసరికి దాదాపుగా రూ.10 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఇలా ఖర్చయితే పేదోళ్ల పరిస్థితి ఏంటి? తక్షణమే అధికారులు చొరవ తీసుకుని సరిదిద్దాలి. లేదంటే ఆస్పత్రి రావడానికే భయపడాల్సి పరిస్థితి నెలకొంటుంది.

–కోన కోటేశ్వరి, సామాజిక కార్యకర్త

మామూళ్లు తీసుకుంటే విధుల నుంచి తొలగిస్తాం

ఆస్పత్రి మాతాశిశు విభాగంలో గర్భిణులకు ఆపరేషన్ సమయంలో కొంత నగదు తీసుకున్నట్టు వచ్చిన అభియోగాలతో వైద్యురాలిని విధుల నుంచి తొలగించాం. ప్రస్తుత వైద్యులు అటువంటి చర్యలకు పాల్పడడం లేదు. ఎక్కడైనా నగదు తీసుకున్నట్లు మా దృష్టికి వచ్చినట్లయితే తక్షణమే విధుల నుంచి తొలగిస్తాం.

–ఎస్.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్, అనకాపల్లి

వర్ష సూచనతో పంట రక్షణ జాగ్రత్తలు

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున వరి పైరును కోయడం వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటను ఇప్పటికే కోసి ఉన్నట్లయితే వర్షానికి తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు చెరకులో కొరడా తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాన్ని వినియోగించుకుని చెరకులో అంతరకృషి చేసుకోవాలన్నారు. వర్షాధార చెరకు పంటకు నేలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని చెరకు నాటేటప్పుడు పొలంలో కలియ దున్నుకుంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. బీర, కాకర, ఆనప వంటి కాయగూరల పంటల్లో రసం పీల్చు పురుగులు ఆశించి మొజాయిక్ వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే అవకాశం ఉందన్నారు. పురుగు నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

జూలో సన్‌డే సందడి

పోటెత్తిన సందర్శకులు.. రూ.3.62 లక్షల ఆదాయం



జూలో పెద్ద పులికి ఫొటోలు తీస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందడిగా మారింది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు రావడం, అందులోనూ ఆదివారం కావడంతో సందర్శకులు పోటెత్తారు. ఎండ తీవ్రత కారణంగా ఎక్కువ సమయం జూ లోపల చెట్ల కిందే గడిపారు. చిన్నారులు చెట్ల నీడలో గంటల తరబడి ఆటలాడుతూ ఎండ వేడిమి కాస్త తగ్గుముఖం పట్టాక జూలో వన్యప్రాణులను తిలకించారు. వాటికి ఫొటోలు తీస్తూ, ఎన్‌క్లోజర్ల వద్ద సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. ఇక్కడ ఏనుగులు, పులులు, కోతులు, జిరాఫీ, జీబ్రాలు, జింకలతో పాటు నెమళ్లు, ఆఫ్రికన్ చిలుకలు, ఆస్ట్రిచ్‌లు, ఈములు వాటి ఎన్‌క్లోజర్లలో ఉదయం, సాయంత్రం సమయంలో హుషారుగా తిరుగుతూ జూకు వచ్చిన పిల్లల్ని, పెద్దలను అలరించాయి. మొసళ్ల జోన్ కొలనులో నీరు వేడెక్కడంతో వాటిలో మొసళ్లు సాయంత్రం వరకు బయటకు రాకుండా అడుగు భాగంలోనే ఉండిపోయాయి. ఆదివారం 4,303 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వారి ద్వారా రూ 3.62 లక్షల ఆదాయం లభించిందన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- మాజీ మంత్రి రజనిపై సీఐ దౌర్జన్యం హేయం
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

అనకాపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మన రాష్ట్రంలో అమలు కావడం లేదని, రెడ్‌బుక్ పాలన మాత్రమే సాగుతుందని ప్రభుత్వ మాజీ విప్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ధ్వజమెత్తారు. స్థానిక రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా, వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. మాజీ మంత్రి విడదల రజనిపై సీఐ సుబ్బారాయుడు దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అతడిని డీజీపీ, గుంటూరు ఎస్పీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల మహిళలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, చంద్రబాబు పాలనలో దాడులు పెరిగిపోతున్నాయన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ మహిళా ఎంపీటీసీని అర్ధరాత్రి అరెస్టు చేయడమే నిదర్శనమన్నారు. అధికారులు రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలా కాకుండా హుందాగా విధులు నిర్వహించాలని హితవు పలికారు. సోషల్ మీడియాలో ఐదారేళ్ల క్రితం పెట్టిన పోస్టులపై ఇప్పుడు కేసులు పెట్టడమేమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, అల్లూరి జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల రక్షణకు అండగా ఉండే సీఐ గుంటూరులో మాజీ మంత్రి రజనీపై అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ మహిళలపై దాడులకు నిరసనగా త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్ రాజా, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80, 83 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, జాజుల రమేష్, సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, ఉగ్గిన అప్పారావు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద, మలసాల కిశోర్, పార్టీ నాయకురాలు నదియా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో సంసారం

టీడీపీ నాయకుడి అండదండలతో ఓ ప్రైవేటు వ్యక్తి దందా

గ్రామ సచివాలయం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల చెంతకే పౌర సేవలను తీసుకువెళ్లేందుకు ఏర్పరచిన వ్యవస్థ. గ్రామ స్వరాజ్యం కలను నిజం చేసే ఈ సచివాలయాల కోసం నాటి సర్కారు పక్కా భవనాలను నిర్మించింది. అక్కడి నుంచే దేశమంతటికీ ఆదర్శంగా నిలిచిన వ్యవస్థ నడిచింది. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడది తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. రోలుగుంటలో మరో అడుగు ముందుకేసి ఓ ప్రైవేటు వ్యక్తికి నివాసంగా కూడా మారింది. స్థానిక టీడీపీ నాయకుడి అండదండలతో ఏకంగా ఆ వ్యక్తి సచివాలయంలో సంసారమే నడిపేస్తున్నాడు. సదాశయానికి గండి కొడుతున్నాడు. ఆయన కుటుంబంతో గత 8 నెలలుగా నివాసం ఉంటున్నా.. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా.. అధికారులు ఏం చేస్తున్నారో.. కూటమి నాయకులు ఏం చెబుతారో! -రోలుగుంట

క్లుప్తంగా

అమ్మకు వందనం



తల్లి అమ్మాజీకి మిఠాయి తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మదర్స్ డేను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన తల్లి అమ్మాజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మకు స్వీట్ తినిపించి, తల్లి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

దివ్యాంగులకు కుట్టుమిషన్ల పంపిణీ



దివ్యాంగులకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి మందిరం సభ్యులు

అనకాపల్లి టౌన్: పుట్టపర్తి సత్యసాయి మందిరం నుంచి పంపిన ఆరు వీల్‌చైర్లు, పొలాలకు వాడే ఏడు స్ప్రేయర్లు, ఏడు కుట్టుమిషన్లను దివ్యాంగులకు జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో అన్నం రాజశేఖర్, కామరాజు, సుబ్రహ్మణ్యం, కన్నూరు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అండర్-11 చెస్ విజేతలు సార్యాజేష్, అష్విన్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా అండర్-11 చదరంగం జట్ల ఎంపిక పోటీల్లో సార్యాజేష్, అష్విన్ విజేతలుగా, శశాంక్, కమలప్రియ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విశాఖ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో గాజువాక లయన్స్‌క్లబ్‌లో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఓపెన్ కేటగిరీలో ఏడు రౌండ్లలో సాగిన పోరులో 97 మంది, బాలికల కేటగిరీ ఆరు రౌండ్లలో 40 మంది పోటీ పడ్డారు. ఓపెన్‌లో ఫిడే రేటింగ్ ఉన్న 9 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. ఓపెన్‌లో ఆరున్నర పాయింట్లతో ఎ.సారాజేష్(1422) విజేతగా, ఆరు పాయింట్లతో కె.శశాంక్(అన్‌రేటెడ్) ద్వితీయస్థానంలో నిలిచారు. బాలికల్లో ఐదున్నర పాయింట్లతో సమఉజ్జీగా నిలిచిన ప్రోగ్రెసివ్‌తో ఎండీ అష్విన్(1480) విజేతగా, బి.కమలప్రియ(1499) ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. 1430 రేటింగ్‌తో ఆడిన పి.సాత్విక ఐదు పాయింట్లతో మూడోస్థానం, సహ్రీన్, సమన్వి నాలుగున్నరేసి పాయింట్లు, 1411 రేటింగ్‌తో ఆడిన చిన్నారి కె.ప్రవల్లికతో పాటు శ్రీలాస్య, యుక్త, శ్రీనందన, లాలిత్య, జ్యోశ్రిత, మనస్వి నాలుగేసి పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు జిల్లా జట్టుగా ఎంపికయ్యారు.

మోదమ్మకు నీరాజనం

- పాడేరులో ఘనంగా అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు
- తొలిపూజ చేసిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దంపతులు
- ఘటాలు మోసిన జేసీ, సబ్‌కలెక్టర్లు
- ఉత్సవ విగ్రహం మోసేందుకు పోటీపడిన భక్తులు
- ఆలయం, సతకంపట్టు వద్ద రద్దీ
- భారీ పోలీసు బందోబస్తు మధ్య జాతర





మోదమ్మ ఉత్సవ విగ్రహం మోసేందుకు పోటీ పడుతున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, శివరత్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఆర్వో పద్మలత, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోదమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలను ఎమ్మెల్యేతో పాటు జేసీ, సబ్‌కలెక్టర్, భక్తులు ఆలయం వెలుపలకు మోసుకువచ్చారు.

వైభవంగా ఉత్సవ విగ్రహం ఊరేగింపు

మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాదాలు, ఘటాలను అధికారులు భక్తులు తలపై పెట్టుకుని మోశారు. మోదకొండమ్మతల్లి ఆలయం నుంచి మెయిన్ రోడ్డులోని సతకంపట్టు మండపం వరకు ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు భారీగా తరలిరావడంతో రద్దీ నెలకొంది. పోలీసుల బందోబస్తు మధ్య ఊరేగింపు జరిగింది. అనంతరం మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సతకంపట్టు మండపంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,అధికారులు,ఉత్సవ కమిటీ ప్రతినిధులు,భక్తులు ప్రతిష్ఠించి అమ్మవారి మూడు రోజుల ఉత్సవాలను ప్రారంభించారు.

ప్రత్యేక ఆకర్షణగా కేరళ బ్యాండ్

మోదకొండమ్మ ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాల ఊరేగింపులో కేరళ బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు వాయిద్యాలు, పులివేషాలు, గరగల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మోదమ్మకు భక్తుల పూజలు

ఉత్సవాల తొలిరోజు మోదమ్మను భక్తులు భారీగా దర్శించుకున్నారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు, సతకంపట్టు వద్ద మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం, పాదాలకు పూజలు చేసేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. సాయంత్రం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. తొలిరోజు మోదమ్మకు భక్తులు నీరాజనం పలికారు. అలాగే సాయంత్రం అమ్మవారి ఘటాలను పాడేరు పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ త్రినాథరావునాయుడు, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి సుబ్బారావు, కూడా సురేషకుమార్, కొణతాల ప్రశాంత్, కొణతాల సతీష్, కాంగు చిన్ని, కేజీయారాణి, వలసంనాయుడు, డీపీ సురేష్‌కుమార్, సల్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

పాడేరు : అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం వెలుపల ఏర్పాటుచేసిన ప్రభుత్వ శాఖల స్టాళ్లను పాడేరు ఎమ్మెల్యే, ఉత్సవ, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలపై సమాచార పౌర సంబంధాల శాఖ, కాఫీ, వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, జీసీసీ, ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖలు వీటిని ఏర్పాటు చేశాయి. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ‘ ఓ యువతా మాదక ద్రవ్యాల మత్తుకు చిత్తు కావొద్దు’ పేరిట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా ఆవిష్కరించారు.

గిరిజన కళాకారులు ప్రదర్శించిన కొమ్ము,థింసా నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల మైదానంలో గిరిజన యువతీయువకుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ ప్రారంభించారు.



ఘటాల ఊరేగింపునకు భారీగా తరలివచ్చిన భక్తులు

3 శతాబ్దాలుగా.. అప్పన్న సేవలో ఒడిశా దాసులు

పది.. ఇరవయ్యేళ్లు కాదు.. ఏకంగా 300 ఏళ్లకు పైనే.. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి సేవలో ఓ కుటుంబం తరిస్తోంది. ఏటా మూడు మాసాలు సింహగిరిపైనే ఉంటూ.. స్వామిని పూజిస్తూ, అర్జిత సేవలు చేస్తూ.. భక్తులకు ఇతోధికంగా సాయపడుతోంది. వారే ఒడిశాలోని గంజాం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన దాసుల కుటుంబం. ప్రస్తుతం ఆ వంశానికి చెందిన నాలుగో తరం వారైన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ అప్పన్నస్వామి సేవలో తరించేందుకు సింహాచలానికి చేరుకున్నారు.

- తరతరాల కుటుంబ సంప్రదాయం... ఒడిశా దాసుల సొంతం
- ప్రస్తుతం స్వామి సేవలో 4వ తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్



అమ్మవారి సన్నిధిలో భక్తులకు నూనె అందిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంతో ఒడిశా భక్తులకు విడదీయరాని అనుబంధం ఉంది. అందులోనూ గంజాంలోని పట్టుపురం గ్రామానికి చెందిన నాయక్‌దాస్ కుటుంబానిది మరీ ప్రత్యేకం. మూడు వందల ఏళ్లకు పైనుంచే ఈ కుటుంబానికి చెందిన ఒకరు స్వామి సేవకు అంకితమవడం ఆనవాయితీ. ఏటా మూడు నెలలు సింహగిరిపై ఉండి స్వామి సేవతోపాటు, తమ వద్దకు వచ్చే భక్తులకు స్వామివారి విశిష్టతను, సింహాచల క్షేత్ర వైభవాన్ని చాటిచెప్తుంటారు.

స్వామి సేవలో నాలుగో తరం

నాలుగో తరానికి చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ప్రస్తుతం అప్పన్న సేవలో తరిస్తున్నారు. ఈయన తాతగారి పెదనాన్న ముకుంద నాయక్ దాస్ నుంచే స్వామికి వీరి కుటుంబం సేవలందించే కార్యక్రమం ప్రారంభమైంది. స్వామిపై ఉన్న ఎనలేని భక్తి కారణంగా అప్పట్లో ఒడిశా నుంచి ముకుంద నాయక్‌దాస్ సింహాచలం వచ్చేశారు. సింహగిరిపై ఓ చెట్టు క్రింద తపస్సు చేసుకుంటూ, స్వామి సేవలో తరించేవారు. కొన్నేళ్లకు కంటిచూపు మందగించడంతో తమ్ముడి కొడుకైన రుషికేష్‌నాయక్‌దాస్ ఏడేళ్ల వయస్సు నుంచే ఆయన వద్దకు చేరారు. తనకు 9 ఏళ్ల వయసులో పెదనాన్న పరమపదించడంతో ఆ బాధ్యతలను రుషికేష్ నాయక్‌దాస్ స్వీకరించారు. ఆయన 95 ఏళ్లపాటు స్వామి సేవలో గడిపారు.

ఒడిశా భక్తుల ఆశ్రయం దాస సత్రం

రుషికేష్‌నాయక్‌దాస్ 1947లో సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయ సమీపంలో కొంత స్థలాన్ని తీసుకుని ఒడిశా నుంచి వచ్చే భక్తుల కోసం ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన మృతితో ఆయన కొడుకు బుచ్చికిషోర్ నాయక్‌దాస్ సింహాద్రి అప్పన్న సేవకు అంకితమయ్యారు. ఆ తర్వాత ఆయన తమ్ముడైన వనమాలిక్ నాయక్‌దాస్ స్వామి సేవను స్వీకరించారు. ఈయన హయాంలోనే రుషికేశ్‌నాయక్‌దాస్ శ్రీకారం చుట్టిన ఆశ్రమం దాస సత్రం నిర్మాణం పూర్తయింది. 2006లో వనమాలిక్ మృతితో ఆయన కొడుకు ప్రస్తుత దాసుడు లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ స్వామి సేవకు అంకితమయ్యారు.

300 ఏళ్లు.. ఐదుగురు దాసులు

- ముకుందనాయక్ దాస్ (ప్రారంభకులు)
- రుషికేష్‌నాయక్ దాస్ (ముకుందనాయక్ తమ్ముడి కొడుకు)
- బుచ్చికిశోర్‌నాయక్ దాస్ (రుషికేష్‌నాయక్ కొడుకు)
- వనమాలిక్‌నాయక్ దాస్ (బుచ్చికిశోర్‌నాయక్ తమ్ముడు)
- లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ (వనమాలినాయక్ కొడుకు)

అంతా స్వామి అనుగ్రహం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఎంతో మహిమాన్వితుడు. నీతి, నియమాలు పాటిస్తూ నిర్మల హృదయంతో ఆరాధిస్తే ఖచ్చితంగా స్వామి అనుగ్రహం లభిస్తుంది. నా తండ్రి పరమపదం వరకు నేను మామూలు వ్యక్తిగానే తిరిగాను. ఆ తర్వాత నాలో భక్తిభావం కలగడం స్వామి కృప. తరతరాల సాంప్రదాయం కొనసాగించే అవకాశం ఆ స్వామి అనుగ్రహంగానే భావిస్తాను. **– లక్ష్మీకాంత్ నాయక్ దాస్**

విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వేపాడ సత్యనారాయణ

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించనున్న సమ్మెకు అన్ని వర్గాల ప్రజల నుంచి పూర్తి స్థాయిలో మద్దతు వస్తోందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని చెప్పారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను అందరూ వ్యతిరేకించాలన్నారు. సోలార్ విద్యుత్, విండ్ విద్యుత్, హైదరాబాద్ ప్రాజెక్టులను, స్మార్ట్ మీటర్లను ఇలా అన్నింటినీ అదానీ సంస్థలకు కట్టబెడుతూ ప్రజలపై విపరీతమైన భారాన్ని ప్రభుత్వం మోపుతోందన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని తెలిపారు. సచివాలయ లైన్‌మన్‌లను విద్యుత్‌శాఖలో విలీనం చేసి, వారికి ప్రమోషన్లు కల్పించాలని ఆయన కోరారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ భవిష్యత్తులో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యకతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్.కె.వి.ఎస్. కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, సభ్యులు అవతారం, కేదారేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన మూడు రోజులకే..

స్నేహితులతో స్నానానికి వెళ్లి నవ వరుడు దుర్మరణం



ఆసరి జగదీష్ (ఫైల్)

రావికమతం: మండలంలో టి.అర్జాపురం శివారు పాత కొట్నాబిల్లి గ్రామానికి చెందిన ఆసరి జగదీష్ (26)కు అదే గ్రామానికి చెందిన ఉమ(22)తో గిరిజన సంప్రదాయంలో ఈ నెల 8 న గురువారం రాత్రి వివాహం జరిగింది. స్నేహితులకు పెళ్లి పార్టీ ఇవ్వడానికి వెళ్లిన జగదీష్ అనుకోని రీతిలో మృత్యువాత పడ్డాడు. గ్రానైట్ క్వారీ వద్ద భారీ గొయ్యిలో ఈతకు దిగి దుర్మరణం పొందాడు. ఈ సంఘటన పాత కొట్నాబిల్లిలో చోటు చేసుకొంది. రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాల మేరకు ఐదుగురు మిత్రులకు పెళ్లి పార్టీ శనివారం గ్రామానికి సమీపంలో ఉన్న క్వారీ వద్ద ఇచ్చాడు. అందరూ కలిసి మద్యం తాగారు. జగదీష్ మాత్రం తవ్వకాల వల్ల ఏర్పడిన గోతిలో ఈతకు దిగాడు. మిగిలిన స్నేహితులకు ఓపిక లేక ఒడ్డునే ఉన్నారు. జగదీష్ ఈతకు దిగి మునిగి పోయిన సంగతి స్నేహితులు గమనించలేదు. స్నేహితులకు మద్యం మత్తు వదిలాక జగదీష్ అక్కడ లేకపోవడంతో ఇంటికి వెళ్లిపోయాడని భావించి ఊర్లోకి వచ్చేశారు. శనివారం రాత్రి జగదీష్ రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద విచారించారు. ఆదివారం క్వారీ వద్ద గోతిలో శవమై తేలాడు. ఘటనపై మృతుడి తండ్రి సీతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కోటవురట్ల: మండలంలోని బయ్యవరం వద్ద మామిడి తోటలో పేకాట శిబిరంపై ఆకస్మికంగా దాడి చేసి ఆరుగుర్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో సిబ్బందితో ముందుగా అందిన సమాచారం మేరకు వెళ్లి ఆకస్మికంగా దాడి చేశామన్నారు. వీరి నుంచి రూ.28,040తోపాటు ఐదు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో హెచ్‌సీ సూర్యారావు, కానిస్టేబుళ్లు మూర్తి, లక్ష్మణ్, రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.

పెదగరువులో జ్వరాల విజృంభణ



జ్వరంతో బాధపడుతున్న కిలో ప్రేమ్ కుమార్, కిలో అక్ష, కిలో సేదరి రాణి

రోలుగుంట: మండలంలోని అర్ల పంచాయతీ శివారు పెదగరువులో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే పలువురు మంచం పట్టారు. అందుబాటులో వైద్య సిబ్బంది లేకపోవడంతో చికిత్స అందడం లేదని, జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. ఎక్కువ మంది పిల్లలు జ్వరాలబారిన పడుతున్నారని చెప్పారు. కిలో ప్రేమ్ కుమార్ (15), కిలో పావులు (1), కిలో అక్ష(4), సేదరి రాణి(4)తో పాటు మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వైద్యాధికారులు స్పందించి, గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకుడు కిలో నర్సయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరారు.

రేపటి నుంచి చందనం ప్యాకెట్ల విక్రయాలు

సింహాచలం: చందనోత్సవం రోజున శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై నుంచి ఒలిచిన నిర్మాల్య చందనాన్ని మంగళవారం నుంచి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ తెలిపారు. చందనం నిల్వలు ఉన్నంత వరకు, ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి చందనం ప్యాకెట్ల టోకెన్లు జారీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉచిత దర్శనం క్యూలో 400 మందికి, రూ.100 క్యూలో 300 మందికి, రూ.300 క్యూల్లో 300 మందికి ఒక్కో టోకెన్‌ను పది రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. స్వామి దర్శనానంతరం దక్షిణ రాజగోపురం వద్ద నుంచి బయటకు వచ్చే ప్రాంతంలో ఉన్న ప్రసాదాల విక్రయశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో టోకెన్లు ఇచ్చి చందనం ప్యాకెట్లు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో భక్తుడికి ఒక టోకెన్ మాత్రమే ఇస్తామని, భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీర జవాన్ త్యాగం మరువలేనిది

మురళీ నాయక్‌కు వైఎస్సార్ సీపీ నేతల నివాళి



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మహారాణిపేట(విశాఖ): పాక్ దాడిలో వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని దేశం మరువదని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మురళీ నాయక్ చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మురళీనాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, రవిరెడ్డి, కటుమూరి సతీష్, మొల్లి అప్పారావు, కొండా రాజీవ్ గాంధీ, బానాల శ్రీనివాసరావు, రాజన్న వెంకటరావు, కటారి అనిల్ కుమార్ రాజు, షేక్ మహ్మద్ గౌస్, ఏమండి సత్యనారాయణ, పేడాడ రమణి కుమారి, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, పులగం కొండారెడ్డి, సేనాపతి అప్పారావు, రామిరెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, దేవరకొండ మార్కండేయులు, నీలాపు కాళిదాస్‌రెడ్డి, కె.రామన్నపాత్రుడు, నాగేంద్ర, అప్పన్న, కొట్యాడ సూర్యనారాయణ, కనక ఈశ్వరరావు, గంగా మహేష్, పీతల వాసు, బెవర మహేష్, గోబింద్ బోధాపు, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంభ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న చిత్రలేఖనం పోటీలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో ఈ నెల 18న ఉదయం 8 గంటలకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 'చిత్రలేఖనం పోటీలు' నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ'పైన, 4 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 'నీటి సంరక్షణ'పైన, 8 నుంచి 10వ తరగతి వారికి 'జీవ వైవిధ్య సంరక్షణ'పై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9246642308 సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



కుర్చీలాటలో విద్యార్థులు

కశింకోట: తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, గణితం సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఖో–ఖో, కుర్చీలాట ఆడించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం మాట్లాడుతూ రోజూ గ్రంథాలయాన్ని సందర్శించి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆటల పైనా దృష్టి నిలపాలన్నారు. ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు.

డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వొద్దు



సమావేశానికి హాజరైన గ్రామీణ వైద్యులు

అనకాపల్లి టౌన్: రోగి చెప్పిన సమాచారాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని, ప్రిస్క్రిప్షన్ పరిశీలించి మందులను ఇవ్వాలని గ్యాస్ట్రో వైద్య నిపుణుడు కె. తిరుపతి తెలిపారు. పట్టణంలోని వివేకానంద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గ్రామీణ వైద్యులకు గ్యాస్ట్రిక్, హార్ట్ ఎటాక్, ఫిట్స్ వంటి వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు కె. మురళీధర్, టి. సురేష్‌బాబు, సింహాచలం, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు అల్లక రాజు, కె. వీరభద్రరావు, వై.వి. రమణాజీ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం నేడు



త్రిపురాంతకస్వామి

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం సర్వమంగళాంబ అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చనలు, అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ జరుగుతుందన్నారు. ఈ నెల 17న సాయంత్రం 6 గంటలకు స్వామివార్లకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వస్తామన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2: జగదీక వీరుడు అతిలోక సుందరి	
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	సింగల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 242 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

గ్రోయిన్లు ఇలా.. సాగునీరు ఎలా?

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏటా పంటలు పండక ఇబ్బందులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



దెబ్బతిన్న వెదురుపర్తి గ్రోయిన్



కశింకోట వద్ద దెబ్బతిని నీరు వృథాగా పోతున్న కాశీమదుం గ్రోయిన్

కశింకోట: మండలంలోని శారదానదిపై గ్రోయిన్లు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు ఊసేలేదు. ఈ ఏడాది అయినా మరమ్మతులు చేస్తారో? లేదోనని రైతులు మదన పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో నదిలో నీటిమట్టం తక్కువగా ఉండటం వల్ల మరమ్మతులు చేపట్టడానికి ఇదే అదునైన సమయం. అయితే ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు పైసా నిధులు విదల్చలేదు. రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు పడి నదిలో నీరు చేరితే ఈ ఏడాదీ పనులు చేపట్టడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడనుంది. దీంతో పంటలు పండక తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఏటా నష్టపోతున్నామని, ఈ ఏడాదీ మరమ్మతులు చేపట్టకుంటే మరింత నష్టపోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని శారదానదిపై కశింకోట వద్ద కాశీమదుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం, ఉగ్గినపాలెం వద్ద గ్రోయిన్లు ఉన్నాయి. సుమారు 2,400 ఎకరాల ఆయకట్టు ఉంది. కాశీమదుం గ్రోయిన్ కింద అత్యధికంగా 938 ఎకరాల ఆయకట్టు ఉంది. దీని నుంచి కశింకోట, వెదురుపర్తి, అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామాలకు సాగునీటి కాలువల ద్వారా పంట భూములకు నీరు సరఫరా అవుతోంది. వెదురుపర్తి గ్రోయిన్ నుంచి వెదురుపర్తి, బయ్యవరం రెవెన్యూ గ్రామాలకు చెందిన 750 ఎకరాలు, పేరంటాలపాలెం గ్రోయిన్ నుంచి అదే గ్రామంతో పాటు తేగాడ, గంటవానిపాలెంకు చెందిన 125 ఎకరాలు, ఉగ్గినపాలెం గ్రోయిన్ నుంచి కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన 500 ఎకరాల ఆయకట్టు భూములకు నీరు సరఫరా కావలసి ఉంది.

గండ్ల ద్వారా దిగువకు వృథాగా నీరు..

అయితే గ్రోయిన్లు నది ప్రవాహ వేగానికి దశాబ్ద మున్నర నుంచి ఆరేళ్ల క్రితం వరకు అడపాదడపా దెబ్బతిని గండ్లు పడ్డాయి. దీంతో గ్రోయిన్ల స్థాయికి నదిలో నీరు నిల్వ ఉండకుండా గండ్ల ద్వారా దిగువకు నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి నెలకొంది. వీటిలో ఉగ్గినపాలెం గ్రోయిన్ నుంచి అయితే సుమారు దశాబ్దమున్నర క్రితం నుంచి చుక్క సాగునీరు ప్రవహించిన పాపాన పోలేదు. ఈ గ్రోయిన్‌కు గండ్లు పడటం, వాటిని పూడ్చకుండా గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇక మిగిలిన వాటి మరమ్మతుల గురించి అధికారులు గాని, ప్రజా ప్రతినిధులుగాని పట్టించుకోని పరిస్థితి నెలకొంది. సాగునీటి కాలువల నుంచి ఆయకట్టుకు వెళ్లే నీరు నియంత్రణకు ఏర్పాటు చేసిన షట్టర్లు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు లేక సక్రమంగా సాగునీరు అందడం లేదు. కాలువల్లో పూడిక తీయక చివరి భూములకు సాగునీరు చేరడం లేదు. దీంతో ఏళ్ల తరబడి సాగునీరు పూర్తిస్థాయిలో అందక రైతులు నష్టపోతున్నారు. వేసవి కాలంలో నదిలో నీరు తక్కువగా ఉండటం వల్ల మరమ్మతులు చేపట్టడానికి ఇప్పుడే అనువైన సమయం. వర్షాలు పడితే నిధులు మంజూరు చేసినా వచ్చే ఏడాది వరకు పనులు చేపట్టడానికి అవకాశం లేని పరిస్థితి నెలకొంటుంది. దీనిదృష్ట్యా సత్వరమే గ్రోయిన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి నదిలోకి వరద నీరు చేరకముందే పనులు చేపట్టి పూర్తి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందడం లేదు



గ్రోయిన్లకు చాలా కాలంగా మరమ్మతులు లేక ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. కాలువల షట్టర్లు దెబ్బతిని మరమ్మతులు లేక సక్రమంగా నీరు ప్రవహించడం లేదు. దీనివల్ల పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోవలసి వస్తోంది. దీని దృష్ట్యా నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు పూర్తిగా సాగునీరు అందివ్వడానికి చర్యలు తీసుకోవాలి.

– బొడ్డేడ సత్యసాయి బాలాజీ, రైతు సంఘం నాయకుడు, కశింకోట

నిధులు మంజూరు కాగానే మరమ్మతులు

శారదా నదిపై దెబ్బతిన్న కాశీమదుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం గ్రోయిన్లకు, కాలువల షట్టర్లు, సాగునీటి కాలువలు లోతు చేసి మరమ్మతులు చేపట్టడానికి రూ.1.92 కోట్లతో నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావలసి ఉంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం.

– ఎం.అమూల్య, ఏఈ, నీటిపారుదల శాఖ, అనకాపల్లి

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది కుటుంబ సమేతంగా వచ్చి, ఆలయం వద్ద వంటలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో క్యూలైన్లు అన్ని నిండిపోయాయి. ఆలయ ఈవో వెంపలి రాంబాబు బాలింతలకు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలకు, వృద్ధులకు, బాలింతలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ ధర్మకర్తలు సూరిసెట్టి సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి పాల్గొన్నారు.

పండగలు ఐక్యతకు ప్రతీకలు



మోదమాంబను దర్శించుకున్న జానకీరామరాజు, కుమార్‌రాజా, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: పండగలు ప్రజల ఐకమత్యాన్ని చాటి చెబుతాయని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కె.ఎన్.ఆర్‌పేట గ్రామంలో మోదమాంబ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా మోదమాంబ అమ్మవారి జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దేవాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్



ప్రతిభ చూపిన విద్యార్థులతో దేవాంగుల సంఘం సభ్యులు

అనకాపల్లి/టౌన్: విద్యార్థి దశ నుంచి ఇష్టపడి చదువుకోవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చౌడేశ్వరీ దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని గొల్లవీధి ముప్పన కనకరాజు చౌడేశ్వరీ దేవాంగ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో దేవాంగ కులానికి చెందిన ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 20 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చౌడేశ్వరీ దేవాంగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్, కాశీ శంకర్‌బాబు, కాలెపు తాతాజీ, ఉప్పు సాంబమూర్తి, రెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న శిథిల కల్వర్టు



శిథిలమైన ఏలేరు కాలువపై ఎ.శరభవరం వద్ద నిర్మించిన కల్వర్టు

నాతవరం: నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నంలో పరిశ్రమలకు ప్రజలు తాగునీటికి ఏలేరు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. నాతవరం మండలంలో 25 కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ ఉంది. ఎంబీపటnం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామం వద్ద ఏలేరు కాలువకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించేందుకు కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు శిథిలం కావడంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొన్న నేషనల్ పవర్ లిఫ్టర్ శ్రీను

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జార్జిక్లబ్ ప్రాంగణంలో అనకాపల్లి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రెండో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ పురుషులు, మహిళల పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వీటిని జనసేన పార్టీ నాయకుడు భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. 53 కేజీల విభాగం సబ్ జూనియర్స్‌లో జి. భానుప్రసాద్, ఎ రాహుల్, 74 కేజీల సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్. స్వరూప్, ఎస్. శ్రవణ్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 59 కేజీల విభాగం సబ్ జూనియర్స్‌లో ఎం. రమ, ఎ. లీలాసాయి, సీనియర్స్ విభాగంలో టి. తులసి, మాస్టర్ విభాగంలో ఎం. శ్రీను, జూనియర్ విభాగంలో జె. లావణ్య, మాస్టర్ విభాగంలో టి. శ్రీనివాస్ విజేతలుగా నిలిచారు. 66 కేజీల సబ్ జూనియర్స్ విభాగంలో పి. సూర్య ప్రథమ, జూనియర్స్ విభాగంలో కె. జగన్నాథరావు ప్రథమ, ఎ. నివాస్ ద్వితీయ, సీనియర్స్ విభాగంలో ఎం. త్రినాథ్ ప్రథమ, మాస్టర్ విభాగంలో ఎస్ గౌతమ్ ప్రథమ, 83 కేజీల జూనియర్స్ విభాగంలో ఎస్. బాలసాయి, సిహెచ్ జయంత్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో పి. దినేష్, మాస్టర్ విభాగంలో బి. రామకృష్ణ ప్రథమ, 93 కేజీల సబ్ జూనియర్స్ విభాగంలో పి, యోగేంద్ర ప్రథమ, ఎ. పవన్ ద్వితీయ, సీనియర్స్ విభాగంలో ఇ. గణేష్ ప్రథమ, ఎం.కె. లలితేశ్వరావు ద్వితీయ, 105 కేజీల విభాగంలో కె. హేమంత్ ప్రథమ బహుమతి సాధించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బహుమతులను ప్రదానం చేశారు.

చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సాయం



సోమేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య స్నేహితులు

పరవాడ: మండలంలోని భర్నికం గ్రామానికి చెందిన ఓ న్యూస్ ఛానల్ పాత్రికేయుడు సోమేష్ ఇటీవల ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమేష్‌కు సర్జరీ జరిగిన తరువాత ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కుటుంబ పోషణ కష్టంగా మారిన సోమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలనే తలంపుతో అతడి బాల్యమిత్రులు ముందుకొచ్చారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడిలో 2006–08లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో చదువుకున్న సోమేష్ చిన్ననాటి స్నేహితులు రూ.21 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆపదలో సాయమందిచిన స్నేహితులకు సోమేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

అనకాపల్లి: స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.35 వేలు అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్మికులు అందరూ ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సమ్మెను చేయడం జరుగుతుందన్నారు. భవన, ఆటో, ముఠా కార్మికులకు సమగ్రమైన సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వియ్యపు రాజు, డి. అనిల్ రాజు, బి.శ్రీను, నర్సింగరావు, అప్పలరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోమాత పూజలు



హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దత్త విజయానంద తీర్థ స్వామిజీ వారి దివ్య అనుగ్రహంతో ఆదివారం తైలాభిషేకం, ఔదుంబర పత్రార్చన, ధూప, దీప నైవేద్యాలు, నీరాజనం, మంత్రపుష్పం వంటి అనేక కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. హోమంలో పాల్గొనే భక్తులకు ఆలయ నిర్వాహకులు ఆంజనేయరాజు మధ్యాహ్నం అన్నసమారాధన, స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ఏకైక చింతామణి గణపతి దత్తక్షేత్రం అనకాపల్లి జిల్లా సిరసపల్లి గ్రామంలో ఉందన్నారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

16న సంకష్టహర చతుర్థి వేడుకలు...

స్థానిక చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 16న సంకష్టహర చతుర్థ పురస్కరించుకని స్వామి వారికి ప్రత్యేక పూజలు, గణపతికి సహస్ర దుర్వార్చన, సంకష్టహర చతుర్థి వ్రతము, ఉండ్రాళ్ల నివేదిక, మహిళలతో సామమూహిక వ్రతం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకుడు ఆంజనేయరాజు ఆదివారం తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: బిహార్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–25కు పరవాడ, అచ్యుతాపురం మండలాల నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ గొర్లి పుష్పారావు తెలిపారు. వీరిలో వాడచీపురుపల్లి శివారు వెంకటాపురానికి చెందిన గొర్లి స్నేహ, గండి దీక్షిత్, అచ్యుతాపురానికి చెందిన డి.ఎ.గౌతమ్ ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం క్రీడాకారులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అభినందించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు. పరవాడ ప్రాంతం నుంచి ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేయడంపై ఏపీ థాంగ్ టా అసోసియేషన్ చీఫ్ ఎం.తులసీరావు ఆనందం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ పుష్పారావును ప్రత్యేకంగా అభినందించారు.

శారదా పీఠంలో యాగం ప్రారంభం



స్వామీజీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న యాగం

పెందుర్తి: భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ రక్షణ, విజయం కోసం శారదా పీఠం తలపెట్టిన వజ్రిణి స్కంద పాశుపత హనుమద్యాగం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని సంస్కారం జరిపారు. అనంతరం స్కంద పాశుపత హోమం, చండీ నవార్ణ మహామంత్ర హోమం, దక్షిణామూర్తి స్వరూప సాంబ సదాశివ హోమం, వీరాంజనేయ హోమం వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు అంకురార్పణ చేశారు. అపరాజిత స్తోత్రం, మహిషాసురమర్దిని స్తోత్రం, కాలభైరవాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణ పఠించారు. ఈ నెల 22 హనుమత్ జయంతి వరకు ఈ క్రతువు కొనసాగుతుందని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర తెలిపారు.

దేశ సైనికులకు సంఘీభావంగా ర్యాలీ



రేబాక గ్రామస్తుల ర్యాలీ

తుమ్మపాల: ఉగ్రవాదాన్ని అంత మొందించడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న దేశ సైనికులకు సంఘీభావంగా రేబాక గ్రామస్తులు ఆదివారం ర్యాలీ చేపట్టారు. మండలంలో రేబాక గ్రామంలో ప్రధాన జంక్షన్ నుంచి జైహింద్.. జై ఆపరేషన్ సిందూర్, జోహార్ మురళీనాయక్ అంటూ నినాదాలతో ఊరంతా జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. దేశం కోసం పోరాడి చిన్న వయస్సులోనే ప్రాణాలకు తెగించి వీరమరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరణం మాణిక్యాలరావు, మాజీ ఆర్మీ సైనికుడు ఎం.భాస్కరరావు, కోట సంతోష్, పచ్చికూర గాంధీ, కరణం నాయుడు, కోన నాయుడు, యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : వేములపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. హైస్కూల్ చదువుల నాటి మధురానుభూతులను నెమరవేసుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికతో పండగ వాతావరణం నెలకొంది. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను స్మరించుకుని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.